క్లుప్తంగా

అర్ధరాత్రి సీపీ తనిఖీలు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మంగళవారం అర్ధ రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు.

పరవాడ తహసీల్దార్‌గా అంబేడ్కర్



తహసీల్దారుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది

పరవాడ: స్థానిక తహసీల్దార్‌గా ఎస్వీ అంబేడ్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నక్కపల్లి మండలం తహసీల్దారుగా పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అంబేడ్కర్‌కు కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు పుష్ప గుచ్ఛాలు అందించి, సాదర స్వాగతం పలికారు. వీరిలో వీఆర్వోలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, హేమలత, భుజంగరావు, కమల, సిబ్బంది ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు సంస్కృతి స్కూల్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 3, 4 తేదీల్లో ఏలూరు పెదవేగి ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న అండర్–19 బాలల సాఫ్ట్ బాల్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి మంగళవారం తెలిపారు. పాఠశాలలో 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎ.వి.శశాంకవర్మ, పి.మహేష్, బి.రోహిత్‌రాజు, కె.ధీరజ్‌శ్రీరామ్ ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను, కోచ్ శ్రీరాజేష్‌ను ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్‌లు అభినందించారు.

స్వచ్ఛందంగా రక్తదానం

పరవాడ: ఎన్టీపీసీ దీపాంజలినగర్ జీవన్‌రేఖా ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాతీయ స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఓ అండ్ ఎం జీఎం ఎస్.జె.డేవిడ్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం వలన ఆపదలో ఉన్న వారిని కాపాడవచ్చన్నారు. గాజువాక వందే భారత్ బ్లడ్ సెంటర్, ఎన్‌జీవో సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 35 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో కె.విజయ(సీఎంవో సింహాద్రి), అసోసియేషన్ ప్రతినిధులు, రక్తదాతలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాంపురంలో 'పొలం పిలుస్తోంది'



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

పెందుర్తి: జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం రాంపురంలో పర్యటించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వరిసాగు, దిగుబడిపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలగించారు. నీటి మోటార్లు, ఇతర వ్యవసాయ పరికరాలు కావాలని అధికారులను రైతులు అడిగారు. మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ హిమబిందు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

పరవాడ: ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు ప్రమాదాలపై మంగళవారం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యా సంస్థలకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. లైసెన్స్ పొందిన విద్యార్థులు మాత్రమే వాహనాలను నడపాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.నారాయణరావు, అధ్యాపకులు జి.శ్రీధర్, లక్ష్మి, కల్యాణి పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. గజానికో గొయ్యి

- పూర్తిగా శిథిలావస్థకు చేరిన పెందుర్తి – జుత్తాడ రహదారి
- కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకూ వీల్లేని దుస్థితి
- దారి పొడవునా గోతులు, రాళ్లు తేలి బురదమయం
- రోడ్డు నిర్మాణం కోసం రూ.2 కోట్లు విడుదల చేసిన గత ప్రభుత్వం
- సాంకేతిక కారణాలు, ఎన్నికల కోడ్‌తో నిలిచిన టెండర్
- ప్రభుత్వం స్పందించి రోడ్డు పనులు ప్రారంభించాలని ప్రజల మొర



పులగానిపాలెం వద్ద అధ్వానంగా ఉన్న పెందుర్తి-జుత్తాడ రహదారి



మహాలక్ష్మినగర్ వద్ద రహదారి దుస్థితి

ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్.. అన్న మహాకవి గురజాడ మాటలను కాస్త మార్చి.. ఈసురోమని రోడ్లు ఉంటే.. అని చదువుకోవాలేమో..! మూలిగే నక్క మీద తాటి పండు పడినట్లు.. భారీ వాహనాల రాకపోకలతో ఛిద్రమైన పెందుర్తి–జుత్తాడ రోడ్డు, తాజా వర్షాలకు మరింత దారుణంగా మారింది. కాలి నడకన, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించేందుకూ వీల్లేని దుస్థితికి చేరింది. కనీసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి, గోతులనైనా పూడ్చాలని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు.



జుత్తాడ సమీపంలో పూర్తిగా ఛిద్రమైన రోడ్డు

పెందుర్తి: పెందుర్తి–పులగానిపాలెం–జుత్తాడ రహదారి. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు. దాదాపు 10 గ్రామాల ప్రజలకు మండల కేంద్రం పెందుర్తిని చేరువ చేసే మార్గం ఇదే. అంతా బాగుంటే నిమిషాల్లో పట్టణానికి చేరుకోవచ్చు. కానీ ఆ రోడ్డు నిర్మాణానికి గ్రహణం వీడలేదు. రోడ్డు పరిస్థితిని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీని నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు కేటాయించింది. కానీ కొన్ని సాంకేతిక కారణాలు, తరువాత ఎన్నికలు రావడంతో టెండర్ ఖరారు కాకుండానే నిలిచిపోయింది. తాజాగా కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణానికి ముందుకు రావాలని స్థానిక ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

వేలాది మందికి ఉపయోగం..

పెందుర్తి(పాత ప్రభుత్వాస్పత్రి) నుంచి పులగానిపాలెం మీదుగా జుత్తాడకు ఈ రోడ్డు కలుస్తుంది. ఈ రహదారి మీదుగా ఎస్ఆర్ పురం, దువ్వపాలెం, జుత్తాడ, అక్కిరెడ్డిపాలెంతో పాటు సమీపంలోని కాలనీలకు చెందిన వేలాది మంది ప్రజలు మండల కేంద్రం పెందుర్తికి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డును ఆశ్రయిస్తే దాదాపు 3–4 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు ఇంధనం, సమయం కూడా ఆదా అవుతుంది. సాధారణ ప్రయాణంతో పాటు ఏదైనా అత్యవసర సమయాల్లో కూడా ఈ మార్గం ఎంతో ఉపయోగపడుతుంది.

రోడ్డు పోయి.. గోతులు మిగిలి..

పుష్కరకాలంగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. వర్షాలతో పాటు క్వారీ లారీలు కూడా తరచూ తిరగడంతో రోడ్డు పూర్తిగా పాడైంది. తాజాగా కురిసిన వర్షాలతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ప్రస్తుతం ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగించే పరిస్థితి లేదు. అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. రోడ్డు శిథిలమై రాళ్లు తేలాయి. గోతుల్లో నీరు చేరి పూర్తిగా బురదమయం అయింది. చాలా చోట్ల రోడ్డు కంటే గోతులే ఎక్కువ. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.

దూరం తగ్గుతుంది



జుత్తాడ నుంచి పెందుర్తికి వెళ్లడం చాలా సులభం. ప్రస్తుతం రోడ్డు బాగోలేక అక్కిరెడ్డిపాలెం మీదుగా పెందుర్తికి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీంతో సాధారణం కంటే ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి. అత్యవసర పరిస్థితిలో చాలా ఇబ్బందిగా మారుతోంది. అదే ఈ రోడ్డు బాగుపడితే దూరంతోపాటు, మాకు వ్యయప్రయాసలు కూడా తగ్గుతాయి. అధికారులు చొరవ తీసుకుని రోడ్డు బాగుచేయాలి.

– ముప్వల శ్రీను, జుత్తాడ

వాహనాలు పాడవుతున్నాయి



మాకు పెందుర్తిలో నిత్యం అవసరాలు ఉంటాయి. ఒక్కోసారి రోజుకు రెండుమూడు సార్లు తిగాల్సి ఉంటుంది. అయితే అక్కిరెడ్డిపాలెం మీదుగా వెళదాం అంటే దూరమవుతుందని ఈ మార్గాన్నే ఎక్కువగా వినియోగిస్తాం. కానీ ఈ రోడ్డులో ప్రయాణం చాలా ఇబ్బందిగా మారింది. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రభుత్వం, అధికారులు త్వరితగతిన స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– అప్పికొండ శ్రీను, దువ్వపాలెం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కొలిక్కి వచ్చేసరికి సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. తరువాత మళ్లీ టెండర్ వేసే సమయానికి ఎన్నికలు వచ్చాయి. దీంతో ఆయా నిధుల వినియోగం జరగలేదు. ఈ రోడ్డు పరిస్థితిని ఇటీవలే ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణంపై దృష్టి సారిస్తామన్నారు.

– బొడ్డు సూర్యప్రకాష్, సీనియర్ నాయకుడు, జుత్తాడ

అప్పన్నకు విశేషంగా గరుడసేవ



గరుడసేవ నిర్వహిస్తున్నఅర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఈసేవని ఉదయం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారి శేషవస్త్రాలను అందజేశారు.

'ఎన్టీపీసీ నిర్వాసితులకు ఉపాధి కల్పించండి'

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉపాధి కల్పించి, ఆదుకోవాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఇందల కొండలరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్టీపీసీలో భూనిర్వాసితులను కాదని స్థానికేతరులకు ఉపాధి కల్పించడం అన్యాయమన్నారు. నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించడంలో యాజమాన్యం తీరని అన్యాయం చేస్తోందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగాల్లో కూడా స్థానికులను కాదని స్థానికేతరులకు అవకాశం కల్పించడం మానుకోవాలన్నారు. అర్హులైన భూనిర్వాసితులను కాంట్రాక్టు ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనకు దిగనున్నట్లు హెచ్చరించారు.

రోడ్డుకు మరమ్మతులు



వాలిమెరక-జుత్తాడ ప్రధాన రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పెందుర్తి: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పాడైన వాలిమెరక జుత్తాడ ప్రాంతంలోని రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. సర్పంచ్ బొడ్డు చంద్రవాణి ప్రకాష్ ఆధ్వర్యంలో గోతులను మట్టితో పూడ్చడం, వంతెనల వద్ద పూడిక తీత తదితర కార్యక్రమాలు చేపట్టారు.

కృష్ణమయ్యకు నృత్య 'వంద'నం



సింహగిరి మాడ వీధిల్లో కృష్ణమయ్య సంకీర్తనలకు నృత్యప్రదర్శన చేస్తున్న నిర్మల నృత్యనికేతన్ కళాకారిణులు

సింహాచలం: కృష్ణమయ్య జయంతి వేడుకల్లో భాగంగా చినముషిడివాడలో ఉన్న నిర్మల నృత్యనికేతన్‌కి చెందిన వందమంది కళాకారిణులు తొలిసారిగా కృష్ణమయ్య కీర్తనలకు మంగళవారం కూచిపూడి నృత్యప్రదర్శన చేసి అబ్బురపరిచారు. వంద మంది కళాకారిణులు సింహగిరిపై మాడ వీధిల్లో చేసిన నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించి భక్తిపారవశ్యంలో మునిగితేలారు. నిర్మల నృత్యనికేతన్ ప్రిన్సిపాల్ విజయజ్యోతిని, కళాకారిణులను దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ నరసింగరావు సత్కరించి స్వామివారి జ్ఞాపికలను అందజేశారు.

మా బతుకులు రోడ్డున పడకుండా ఆదుకోండి

ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ఆందోళన



పరవాడలో నిరసన తెలుపుతున్న మద్యం దుకాణాల ఉద్యోగులు

పరవాడ: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మద్యం దుకాణాల ఉద్యోగులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ వలన తమ ఉద్యోగాలు కోల్పోతున్నామని వాపోయారు. మండలంలో ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగులు మంగళవారం షాపులు బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా బెవరేజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిపిన మద్యం దుకాణాల్లో అహర్నిశలు పనిచేసి ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయాన్ని తీసుకొచ్చామన్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన మద్యం పాలసీ ద్వారా తమకు ఎలాంటి ఉద్యోగ భద్రత కల్పించకుండా, విధుల్లో నుంచి తొలగిస్తామని ప్రకటించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు తమ సమస్యలపై స్పందించి, ఆదుకోవాలని కోరారు. నిరసన కార్యక్రమంలో బొన్నాడ రవి, యాసరపు నాయుడు, లాలం ముత్యాలనాయుడు, ఆదిరెడ్డి సత్యారావు, వక్రి నరసింహమూర్తి, జగన్నాథం, స్వామి, పి.లక్ష్మణరావు, పి.నగేష్, గంగునాయుడు, జి.నాగేష్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దోమల నివారణకు సమగ్ర చర్యలు



95వ వార్డులో డ్రోన్లను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: రోగాల వ్యాప్తికి కారణమైన దోమలను పూర్తిస్థాయిలో నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వార్డులోని పురుషోత్తపురం వెంకప్ప చెరువు, జ్యోతినగర్ చెరువు, లక్ష్మీపురం రాముడు చెరువుల్లో జీవీఎంసీ ఆధ్వర్యంలో దోమల నివారణకు డ్రోన్లతో రసాయనాలు పిచికారీ చేసే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జోన్–8 మలేరియా నియంత్రణ విభాగం ఇన్‌స్పెక్టర్ దాలినాయుడు, సూపర్‌వైజర్ సత్యనారాయణ, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

97వ వార్డులో: శ్రమశక్తినగర్ చెరువు, కార్మికనగర్ చెరువులలో దోమల నియంత్రణ రసాయనాల పిచికారీ డ్రోన్లను కార్పొరేటర్ శానాపతి వసంత ప్రారంభించారు. కార్యక్రమంలో శానిటరీ విభాగం అధికారులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

పరవాడ: స్థానిక బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు మంగళవారం గోడపత్రికను ఆవిష్కరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా మండపం వద్ద 9 రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ నెల 3న వెంకటరమణమూర్తి పాటతో మొదలయ్యే వేడుకలు 12న అమ్మవారి అనుపు మహోత్సవంతో ముగుస్తాయన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, నాయకులు కనకారావు, వెంకటరావు, అప్పలనాయుడు, హరీష్, సత్యవేణి, హరి, ప్రసాద్, చిన్న పాల్గొన్నారు.

ఖరీఫ్ వరికి ఈ పంట, ఈకేవైసీ తప్పనిసరి

- రైతులకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచన
- ఈ పంట, ఈకేవైసీ వివరాలపై క్షేత్రస్థాయి పరిశీలన



తవ్వవానిపాలెంలో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

సబ్బవరం: రైతులు ఆరోగ్యవంతమైన, నాణ్యమైన పంటలను పండించే దిశగా వ్యవసాయ అధికారులు వారిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో ఖరీఫ్ వరికి ఈ పంట నమోదు కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన సర్వే నంబర్లలోని వరి క్షేత్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. గ్రామంలోని డెక్కా సన్నిబాబు అనే రైతు పొలాన్ని పరిశీలించి ఈ పంట నమోదుతో సరిపోల్చి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పంట నమోదు, ఈకేవైసీ కార్యక్రమాన్ని రైతులు విధిగా చేయించుకోవాలని సూచించారు. ఆనంతరం గ్రామ వ్యవసాయ సహాయకుల పనితీరు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న ఎరువులు, విత్తనాల లభ్యతపై ఆరా తీశారు. చిన్నయ్యపాలెంలో కూరగాయలు పండించే రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, సర్పంచ్ బోకం స్వామినాయుడు, ఏఈవో బాలరాజు, వీఏఏ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా మండలంలోని అమృతపురం గ్రామంలో పింఛన్ల పంపిణీని కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. తొలిరోజే శత శాతం పింఛన్ల పంపిణీకి కృషి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, ఈవోపీఆర్డీ మహేష్, డీఆర్‌డీఏ పీడీ, ఎస్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాంపురం హైస్కూల్‌కు ఎస్‌బీఐ వితరణ



పాఠశాలకు సామాగ్రి అందిస్తున్న ఎస్‌బీఐ ఉన్నతాధికారులు

పెందుర్తి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సీఎస్ఆర్ సేవల్లో భాగంగా మండలంలోని రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు భారీ సాయం అందించింది. పాఠశాలలోని విద్యార్థులు, సిబ్బంది సౌకర్యం కోసం రూ.5 లక్షల నిధులతో ఆర్వో ప్లాంట్, రెండు కంప్యూటర్లు, రెండు టేబుళ్లు, నాలుగు బీరువాలు, 16 ఆధునిక బెంచీలు, స్కానర్, ప్రింటర్, రెండు కంప్యూటర్ చైర్లను సమకూర్చింది. మంగళవారం పాఠశాలలో రాంపురం ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా హెచ్ఎం ప్రసాద్‌కు వీటిని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్యాంక్ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడంతో పాటు సమాజానికి కూడా విస్తృత సేవలందిస్తున్నట్లు తెలిపారు భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ జి.ప్రకాష్, ఎస్‌బీఐ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



పి.ప్రశాంతి



ఎ.ఆనంద్



డి.మాతాజీ

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి అండర్–19 వాలీబాల్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.మురళీధర్ తెలిపారు. ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు పి.ప్రశాంతి, ఎ.ఆనంద్, డి.మాతాజీ జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీరిని జిల్లా వృత్తి విద్యా పర్యవేక్షణ అధికారి పి.మురళీధర్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి, కళాశాల సిబ్బంది అభినందించారు.

ఘనంగా కృష్ణమయ్య జయంతి



కృష్ణమయ్య విశిష్టతని వివరిస్తున్న స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్



కృష్ణమయ్య విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: భాద్రపద చతుర్దశిని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం శ్రీకాంత కృష్ణమాచార్య(కృష్ణమయ్య) జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉన్న కృష్ణమయ్య విగ్రహం చెంతన దేవస్థానం వైదికులు విశేషంగా పూజలు నిర్వహించి హారతులందించారు. స్వామివారిపై కృష్ణమయ్య రచించిన పలు సంకీర్తనలను ఈ సందర్భంగా వైదికులు విన్నపం చేశారు. కృష్ణమయ్య చరిత్రను, విశిష్టతను వివరించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు, పారాయణదారులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గణేష్ నిమజ్జనంలో విషాదం

- విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి



పోలవరపు శ్యామ్ మృతదేహం

మునగపాక: మునగపాకలో సోమవారం రాత్రి జరిగిన గణేష్ నిమజ్జనంలో విషాదం నెలకొంది. విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలం రావాడ పంచాయతీ ధర్మారాయుడుపేటకు చెందిన పోలవరపు పైడికొండ కుమారుడు శ్యామ్(22) పరవాడలోని ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. ఖాళీగా ఉన్న సమయంలో డీజే నిర్వాహకులతో పని చేస్తుంటాడు. దీనిలో భాగంగా సోమవారం రాత్రి మునగపాకలో వినాయక నిమజ్జనానికి బంధువులకు చెందిన డీజేను తీసుకువచ్చాడు. వినాయక ఊరేగింపులో భాగంగా కొంత సేపటి తరువాత విద్యుత్ షాక్‌కు గురై శ్యామ్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అతనిని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తాడనుకున్న కుమారుడు అర్ధంతరంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. శ్యామ్ తండ్రి పైడికొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.